
# పంతులమ్మ పరిధి




“నీజీవితము చాలాచిన్నది. ఆ మాటకువస్తే నీ జీవితపరిధే చాలా చిన్నది.” అన్నమాటలను మననముచేసుకొంటు చిన్నరూము తాళము తీయ ప్రయత్నించింది. అప్పుడే చిన్న బడినుండి వచ్చిన చిన్నపంతులమ్మ “నిజమే! యెంత చిన్న తాళము! అంతకంటే చిన్నరంధ్రము!! దానికంటే మరో చిన్న తాళపు చెవి!!! అనుకున్నది చిన్నపంతులమ్మ చిన్న వృత్తాకారపు చిత్తము.

“నిజముగా నా జీవితపరిధి చిన్నదేనా?” అని అనుకొంటు చిన్న తాళాన్ని చిన్న ‘టేబుల్’ మీద పెట్టింది. చిన్నగ ‘రూము’ నంత ఒకసారి చిన్నగ పరికించింది. చిన్న గది ఎత్తుచిన్నది. వెడల్పు చిన్నది. ‘ఏరియా’ చిన్నదే చిన్న టేబుల్ చిన్నకుర్చీ చిన్న యీజీచేర్ అంటే చాలాచిన్న పర్నిచరే.

అలా అనుకుంటు వంటగదిలోకి ప్రవేశించింది చిన్నారి పంతులమ్మ. అది యింకా చిన్నగది. చిన్న అలమారలో చిన్నచిన్న పాత్రలు చిన్నపొయ్యి చిన్నబిందె చిన్నపీట చిన్న ప్లేటు చిన్నచెంబు చిన్నగ్లాసు ... అలా అనుకుంటూ చిన్న ‘సైజు’ గానే ఆ పూట భోజనము పూర్తిచేసింది.

రచన: బాలరాజు

చిన్న టవలుతో చెయ్యిని నున్నగ తుడుచుకొంటూ మెల్లగ పడక గదిలోకి ప్రవేశించింది. అదికూడ చాలా చిన్నగదే. అక్కడక్కడ చిన్నగోడలకు చిన్నచిన్న పటాలు ఫోటోలు చిన్నకిటికీలకు చిన్న నీలితుండు గుడ్డలు చిన్న మంచము ఎత్తుచిన్నదే వెడల్పుచిన్నదే దానిమీద చిన్నబెడ్ బెడ్‌మీద చిన్నబెడ్‌షీట్ చిన్న తలదిండు చిన్న గూడులో చిన్న గడియారము చిన్నగ చిన్నశబ్దము చేయుచున్నది

చిన్న అద్దముముందు నిలువబడింది చిన్నారి పంతులమ్మ. అద్దములో చిన్నపంతులమ్మ చిన్నకోలముఖము, చిన్న చిలిపికళ్ళు, చిన్నచక్కని ముక్కు, చిన్నలేత పెదవులు, చిన్నసున్నని చెంపలు, ఒడ్డుచిన్నదే, ఓడువు చిన్నదే.

పంతులమ్మకు పిచ్చిఎత్తి నట్లయింది. అన నలుబది యేండ్ల కుమారి జీవితములో యెన్నడు తాను యింతగా ఫీల్ కాలేదే. మరి యేమిటీ రోజు యెందుకు తనకు అన్నిచిన్న విగా కనబడుచున్నవి. నా యీ యేకాంత జీవితానికి అన్ని చిన్నవిగా అగుపడుచున్నదేమో? నా జీవితమింతేనా? ఇంతే యెందుకు కావలయును. పెద్దయిల్లు పెద్దఫర్‌నీచర్ పెద్ద మంచము తీసికొంటే అందులోనైనా యీ చిన్న బడి పంతులమ్మగా అదియుగాక పెద్దమంచములో యింకొకరికి స్థలము వుండును. అది యెవరికి! వారికి! పెళ్ళికుమారునికి. ఈ నలుబది యేండ్ల పెండ్లికూతురును చేసికునే పెండ్లికొడుకెవడు? అయినా తనెందుకిన్నాళ్లు కుమారిగా వుండాల్సి వచ్చింది. దీనికెవరు బాధ్యులు. కలిగించిన దేవుడా? లేక కన్నతల్లి దండ్రులా? లేక తనేఅందుకు బాధ్యురాలా?...

దేవుడు దేవుడే అయితే నా జీతాన్ని యింత చిన్నగా చేస్తాడా!? దేవుడు దయగలవాడని, కరుణా, ప్రేమలకు ఆలయమని, చాలా గొప్పవాడని అంటారు. అంతపైనున్న ఆ గొప్పదేవునికి యింత చిన్నపంతులమ్మ అగుపడిందోలేదో? ఇది నిజమైతే యిందులో దేవుని తప్పేముంది. ఇక పోతే తల్లిదండ్రులో ...?

చిన్నపంతులమ్మ చిన్నవదులు పయ్యెద వుయ్యాల వలె వూగింది. వేడి నిట్టూర్పుల దాడికి ఎర్రని మెత్తని చిన్న నాసిక రంధ్రాలు నల్లబారినవి. ఈర్ష్యా, ద్వేషము, కోపము తాపము అంటే యిలావుంటాయి, అన్నట్లున్నవా ముదురు యెరుపుదీరిన చిన్న నయనాలు.

ఆడపిల్లల సొమ్ముతినే వారుకూడ ఒకతల్లితండ్రులా? కన్నందుకు వారివిధి అంతేనా? స్కూల్ ఫైనలు చదివించినారు, పంతులమ్మ ట్రెయినింగ్ కావించినారు, వుద్యోగము చేయమన్నారు, డబ్బుయివ్వమన్నారు. అంతేనా వారి బాధ్యతా? డబ్బుకాశపడి తనకు పెళ్లికాకుండ చేసిన తుచ్ఛులు, నీచులు, ముచ్చులు. కన్నకూతురి నిట్టూర్పుల వేడి వారిని నాశనము చేస్తాయని చచ్చినా తెలుసుకోలేని అధమాధములు.” పంతులమ్మ ఆలోచనలు తిన్నగా యింకాలోతుకు పోయినవి...

“తనకు యిరువది యేండ్లప్పుడు యెన్నో పెళ్లిసంబంధాలు వచ్చినవి. అప్పటికి అన్ని వంకలు చూపి చల్లగ సాగనంపినారు. నా కన్నీళ్లు తుడవడానికేమో? అబ్బాయి అందంగ లేడని, ఉద్యోగము అసలే లేదని వారి వంశములో యెవరో లేచిపోయినారని. మీదటికి తప్పక చూస్తామని! యింకా యెన్నెన్నో కరుణ జాలిలేని కసాయి వాళ్లు నీతినిజాయితి లేనిపక్కా కుక్కబుద్ధులు ఎంగిలికూడుతినేరకము ఛీ! ఛీ! వారిని తలంచుకొనడమే మహాపాపము. పచ్చగా

పుండవలసిన నా జీవితాన్ని వెచ్చని సహారాఎడారివలె చేసిన రాక్షసులు. నాలుగు శబ్బురాళ్ళకాశపడి చల్లని నా జీవితానికి చిచ్చుపెట్టిన చచ్చు పీనుగలు. భగవంతుడనే వాడే వుంటే వీరిని నిజముగా క్షమించడు. కన్నకూతురు కడుపునే కొనేకఠిన సిసలైన కసాయివాళ్లు వీరొక్కరేగాదు. అసామెలు మోషయ్య, యిస్సాకు, జకరయ్య... అంతా దొంగ బడువలు. కూతుర్ల సొమ్ము కూడ పెట్టిమూటలుగట్టె కుటిలహృదయులు. ఒకరికొకరు పోటీలుపడి కొన్ని కుటుంబాలనే కూలద్రోసి నేల మట్టము చేసిన కుంచిత స్వభావులు. అన్నెము పున్నెము నెరుగని పసిడి బాలకన్నెల పచ్చని జీవితాలను పాడుచేసే బడుద్ధాయిలు.

పంతులమ్మ భారంగా నిట్టూర్చింది. ఆలోచనల భారముచే పాల భాగము విడివడిన ముప్పిరి త్రాడువలె మూడు ముడుతలను పులుముకొన్నది కను బొమలు ముడివడి ఒకదానికొకటి కలువప్రయత్నించుచున్నవి. ఆవేశపూరితమైనది.

"కన్నకూతురు పెళ్ళికాలేదని బెంగ వారికే కోశాన అయినా వుందా? ఏకాంతసమయంలో ఒక్క చిక్కిన బిడ్డడు యెంత కుమిలి పోతుందోనని వారెప్పుడైనా అనుకొన్నారా? చల్లని వెన్నెల రాత్రులలో, చిన్నపిల్ల లేతహృదయము తల్లడిల్లి యెంత అల్లల్లాడిందో ఆ కుళ్ళుహృదయులు యెప్పుడయిన వూహించినారా? వసంతకాలములో పసంతైన వాతావరణములో, ఆల్ల బిల్లి పిల్లి మలయ మారుత తుంపరలలో, సాయంసమయ సంధ్యవేళలలో, ఆనందముగా తిరిగే జంటలను ఒంటరిగా గాంచినప్పుడు ఆకలకంఠి హృదయము యెంత కాలిపోయిందో అఘాతకులు యెప్పుడయిన ఆలోచించినారా? వణ్ణుకొరికే చలిరాత్రులలో, సులివెచ్చని శాలువలో, పిల్లయెద వుప్పొంగే వేళలో ఆ లలనామణి యెంత తల్లడిల్లిందో ఆ వల్లమాలనవారెప్పుడయిన తలంచినారా? ఒంటరి జీవితపు కుంటుతనములో గుంటడు యెన్ని తంటాలు తింటున్నదో అని వారెన్నడయిన అనుకుంటున్నారా? కంటికింపయిన జంటలతో నిండిన సినిమాహాలును, కాఫీ హొటల్లను, సిటీబస్సులను, పార్కులను, బీచ్‌లో స్వేచ్ఛా విహారులను, చూచినప్పుడు ఆ మచ్చకంటి విచ్చిన్నవదనము యెంత చంచలత్వము నొందిగాయపడిందో ఆ చచ్చుపీనుగలు యెప్పుడయిన మచ్చుకైన అనుకొన్నారా?"

"నా వ్యక్తిత్వాన్ని చంపి, నావూహలను చింపి, నా ఆదర్శాలకు తలవంపులు కలిగించి, నా ఆశయాలకు ఏవగింపు కలిగించి, నా జీవితానికే ఒక కంపు కల్గించిన వీరొక మనుష్యులేనా? కాదు. మానవత్వాన్ని చంపుకొన్న మానవాధములు, రాక్షసులు నీచులు, తుచ్ఛులు, కృతఘ్నులు, ఘాతకులు. ఛీ.ఛీ. యీలాంటి తిట్లు వారికి చాలవు. వారిని అనుకోవడమే ఆత్మ వంచన."

బరువెక్కిన హృదయముతో ఒక్కసారి నిట్టూర్చింది పంతులమ్మ, యెంత ఆలోచించినా దీని ఫలితభారము యింతె నన్నట్లు లోకమందున్న నిశ్శబ్దమంత ఆ ఒక్క చిన్న గదిలోనే ఆవరించి నట్లుంది. సెకనులు, నిముషాలు, గంటలు చిన్నగా గడిచిపోవుచున్నవి. ఊహలకందని వూహల బాధల వ్యథల గాథల రాపిడిలకేమో, పంతులమ్మ పయ్యెద తొక్కుడు వుయ్యాలవలె వూగసాగింది. ఆ వుయ్యాల వూపుల వంపుదింపుగాలి తరంగాల తాకిడలకెమో, పంతులమ్మ పయ్యెదపైనున్న నైలాను పల్లెవాటు గాలి పటములా పెరుగుతుంది. రొదసీమలో దారము వీడిన పతంగము దారిగానక రోదనముచేస్తూ, విచ్చలవిడిగా ఆకాశమంచుల వరకు వెల్లినట్లు, పల్లెవాటు పట్టువీడిన వెంటనే పంతులమ్మ బాడీ వదులు లోనిరొమ్ములు విజృంభించి, చక్కగా నిక్కపొడుచుకొని, బాడీ బిగువు తగలగానే నా 'పరిధి' యింతే నేమో నన్నట్లు బిరబిగుసుక పోయింది. ఇంతగడిబిడి గందరగోళం జరుగుతున్నా, అక్కడ వాతావరణమంత స్థంభించి పోయినా, 'నాపని నాదే' అన్నధోరణిలో 'టంగ్, టంగ్, టంగ్' మంటు మూడు కొట్టింది, చిన్న గూడులోని అంత కంటే చిన్నగడియారము కొద్దిగచిన్నగానే...

"అబ్బ! అప్పుడే మూడుగంటలయిందే..." అనుకున్నది. వూహలకందని వూహలతో గల్లంతై చిత్తయి పరాకైన పంతులమ్మ చిత్తములోని ఒక గట్టి 'చిత్తు' ముక్క" చిన్నగ వుదయముననే లేయాలి. చిన్న చిన్నగా చిన్నగదిలో చిన్న చిన్న వంటలు చేయాలి. చిన్నవాకిలికి చిన్నతాళము వేసి, చిన్న గేటుగుండా చిన్నగా చిన్న రోడ్డువెంట చిన్న స్కూలుకు వెల్లాలి. చిన్న పిల్లలకు చిన్న చిన్న పాఠాలు మరీచిన్నగ చెప్పాలి. తిన్నగ అయిదు గంటలకు చిన్నరోడ్డు వెంట చిన్న రూముకు రావాలి. చిన్న గదిలో చిన్న మంచములో తాను యింకా చిన్నగ వుండాలి." అని యెకసెక్కి మాడింది ప్రక్కనే వున్న 'బొత్తు' ముక్క, మూడు గంటలు అయితే నేమిఅన్న ధోరణిలో.

తను వుండేది చిన్నగది. వండేది చిన్నపాత్ర, పండేది చిన్న మంచం, చేసేది చిన్న బడిపంతులమ్మ పని. వెల్లేది చిన్నస్కూలుకు, చెప్పేది చిన్నపిల్లలకు. అంతే తన వాతావరణము పరిసరము చాలా చిన్నది. పంతులమ్మ పదమే చిన్నది. సులువైనది విలువలేనిది. తన బ్రతుకే అంత తనజీవితమే చాలా చిన్నది. దానిపరిధి అంతకంటే చిన్నదేమో?!" వేడినిట్టూర్పులదాడి తాకుడలకేమో పంతులమ్మ విశాల వినీలనేత్రాల తలుపులు మూసికొన్నవి.

కోడి 'కొక్కొరోకో' యంది. నీ జీవితమే అంత అన్న ధోరణిలో ★